క్లుప్తంగా

మంత్రి వివేక్‌ను కలిసిన నాయకులు



మంత్రి వివేక్‌ను కలిసిన మాజీ మంత్రి చంద్రశేఖర్, కాంగ్రెస్ నాయకులు

జహీరాబాద్: రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్‌ను జహీరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ మేరకు మంగళవారం మంత్రిని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి నియోజకవర్గ అభివృద్ధి, తదితర అంశాలపై చర్చించారు. ఆయనను కలిసిన వారిలో మాజీ మంత్రి చంద్రశేఖర్, ఆత్మ కమిటీ చైర్మన్ రామలింగారెడ్డి, ఆయా మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు హన్మంత్‌రావు పాటిల్, నర్సింహారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మక్సూద్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అర్షద్‌అలీలు ఉన్నారు.

సీపీఆర్‌పై విద్యార్థులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న వైద్యులు

మునిపల్లి(అందోల్): సీపీఆర్‌పై కార్డియో, న్యూరో ఆస్పత్రి సంగారెడ్డి డాక్టర్ కృష్ణ మూర్తి మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మంగళవారం మండలంలోని పెద్దగోపులారం పాఠశాలలో న్యూరో నరాలకు సంబంధించిన వివిధ రకాల వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుల్తాన్‌తో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ సహజం



నర్సింహారెడ్డి దంపతులను సన్మానిస్తున్న ఎంఈఓ మాణయ్య

జహీరాబాద్ టౌన్: ప్రభుత్వ ఉద్యోగికి పదవి విరమణ సహజమని ఎంఈఓ మాణయ్య అన్నారు. ఈ మేరకు మొగుడంపల్లి ఉన్నత పాఠశాల జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేసి పదవీ విరమణ పొందిన నర్సింహారెడ్డి దంపతులను మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంకితభావంతో విధులు నిర్వహిస్తే గుర్తింపు లభిస్తుందన్నారు. ఆయన ఎక్కడి పనిచేసిన అందరి మన్ననలు పొందారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రైతుబీమా దరఖాస్తు చేసుకోండి

వ్యవసాయ అధికారి అభినాష్‌వర్మ



బీమా దరఖాస్తుల స్వీకరిస్తున్న ఏఈఓ సాయిలు

న్యాల్‌కల్(జహీరాబాద్): అర్హులైన రైతులందరూ రైతుబీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి అభినాష్‌వర్మ సూచించారు. మండలంలోని వివిధ గ్రామాల్లోని రైతు వేదికల్లో మంగళవారం రైతుల నుంచి బీమా దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో రైతుబీమా కోసం 900 మంది అర్హులైన రైతులు ఉండగా ఇప్పటివరకు 150 మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. దరఖాస్తు గడువు ముగుస్తున్నందున మిగిలిన రైతులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

సౌర విద్యాయాగ మహోత్సవం



సంగారెడ్డి టౌన్: మండలం పరిధి పసల్వాదిలోని జ్యోతిర్ వాస్తు విద్యాపీఠంలో సౌర విద్యాయాగం మహోత్సవం నిర్వహిస్తున్నట్లు పీఠాధిపతి మహేశ్వర శర్మసిద్ధాంతి తెలిపారు. మంగళవారం విద్యాపీఠంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆగస్టు 15,16,17 మూడు రోజులు పాటు విద్యా గణపతి, అపరాజిత నవయాతన, విద్యాయాగం వంటి క్రతువులు నిర్వహించనున్నట్లు చెప్పారు. శ్రీవిద్యా సంప్రదాయంలో 12 రకాల విశేష అర్చనలు, 108 విశేష ప్రసాదాలు, లక్షల సూర్య నమస్కారాలతో తొలిసారిగా సూర్యమేరువు నిర్వహిస్తున్నామని తెలిపారు. సమావేశంలో విద్యాపీఠం సహాధ్యక్షుడు ప్రశాంత్‌కుమార్, విద్యాపీఠం సభ్యులు పాల్గొన్నారు.

రోడ్లపై మురుగు వరద

అమీన్‌పూర్‌లో రోడ్లు ధ్వంసం.. పొంగిన డ్రైనేజీలు

ఇబ్బందులు పడుతున్న ప్రజలు ● పట్టించుకోని అధికారులు



టెంపుల్‌కు వెళ్లే దారిలో కుంటలా మారిన రోడ్డు

పటాన్‌చెరు: అమీన్‌పూర్ పట్టణంలో రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలతో పాత రోడ్లు దెబ్బతిన్నాయి. డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నాయి. రోడ్లపై కాలు తీసి కాలు పెట్టే పరిస్థితి లేదు. డ్రైనేజీ నీరు వరద నీటితో కలిసిపోయి రోడ్లపై పారుతున్నాయి. మురుగునీటి ప్రవాహం వల్ల కాలనీలు కంపుకొడుతున్నాయి. అమీన్‌పూర్ పట్టణంలో మొత్తం 150 కాలనీలు ఉన్నాయి. అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలో ముఖ్యంగా పాత అమీన్‌పూర్ ప్రాంతంలో డ్రైనేజీ సమస్యలు ఎక్కువగా ఉన్నాయి. మొత్తం అన్ని గ్రామాల్లోనూ కొత్తగా వెలసిన కాలనీల్లో రోడ్లు, డ్రైన్‌లు అభివృద్ధికి నోచుకోలేదు. పదేళ్ల క్రితం ఏర్పాటైన వెంచర్లలో కూడా డ్రైనేజీ, రోడ్ల సమస్యలు ఉన్నాయి. టెంపుల్‌కి వెళ్లేదారిలో రోడ్డు అధ్వానంగా తయారైంది. టైలర్స్ కాలనీలో డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నాయి. బీరంగూడ ఆలయ పరిసర కాలనీల నుంచి వచ్చి చేరుతున్న డ్రైనేజీ నీరు దేవాదాయ శాఖ పరిధిలో ఉన్న భూమిలో జమవుతుంది. అయ్యప్ప హోమ్స్, మణికంఠ, టైలర్స్ కాలనీ, టీచర్స్ కాలనీ, ఎస్ఎస్ఎల్, టీపీఆర్ నగర్ కాలనీల వైపు నుంచి వచ్చే మురుగునీరు ఆలయభూమిలోని ఖాళీ జాగాలో నిల్వ ఉంటున్నాయి. జమవుతున్న మురుగునీటి కారణంగా దోమలు, ఈగలు పెరుగుతున్నాయి. మాజీ కౌన్సిలర్ సదుల మల్లేష్ మాట్లాడుతూ.. దేవాలయానికి వెళ్లేదారిలో రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు అయినప్పటికీ నేటికీ పనులు ప్రారంభించకపోవడం విస్మయం కలిగిస్తుందని మండిపడ్డారు. ఎస్ఎస్ఎల్ కాలనీ నుంచి టైలర్స్ కాలనీకి అయిదేళ్ల క్రితం వేసిన తారు రోడ్డు వర్షాలకు ధ్వంసమైందని చెప్పారు. కౌన్సిలర్ సాక్షితో మాట్లాడుతూ స్పెషల్ ఆఫీసర్ నిర్వాహకం కారణంగా అభివృద్ధి పనులు ఎక్కడికక్కడే నిలిచి పోయాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ పార్టీ రాష్ట్రంలో అధికారంలో ఉన్నప్పటికీ అమీన్‌పూర్ పట్టణంలో సమస్యలు అపరిష్కృతంగా ఉండటంపై అసహనం వ్యక్తం చేశారు.

> **ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి చేస్తాం**
>
> మున్సిపల్ పరిధిలో నెలకొన్న సమస్యలపై వివరాలు సేకరించాం. వర్షాలకు దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపడతాం. గ్రామంలో సమస్య తీవ్రంగా ఉన్న చోట డ్రైనేజీ నిర్మాణాలు చేపడుతున్నాం.
>
> –జ్యోతిరెడ్డి కమిషనర్, అమీన్‌పూర్ మున్సిపాలిటీ

మహాసభల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



మహాసభల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా సీపీఐ నాయకులు

సదాశివపేట(సంగారెడ్డి): ఈనెల 20 నుంచి 22 వరకు జరగనున్న సీపీఐ రాష్ట్ర 4వ మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు తాజోద్దీన్ పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మహాసభలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారంలోని మహారాజ గార్డెన్స్‌లో మహాసభలు జరుగుతాయన్నారు. ఈ సభలకు మునిపల్లి, కొండాపూర్, సదాశివపేట పట్టణ మండల పరిధిలోని నాయకులు, కార్యకర్తలు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో లక్ష్మి, శివలీల, బుజ్జమ్మ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల అందజేత



చెక్కులు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నారాయణఖేడ్: బాధితులకు మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను మంగళవారం కాంగ్రెస్ నాయకులు అందజేశారు. ఈ మేరకు జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ సిఫార్సుల మేరకు ఖేడ్‌కు చెందిన జావీద్‌కు రూ.60 వేలు, హఫీజ్‌కు రూ.20 వేలు, సంజీవన్‌రావుపేటకు చెందిన నాగమణికి రూ.22 వేలు, జనాబాయికి రూ.18 వేలు, ముక్తుంపూర్‌కు చెందిన హన్మాండ్లుకు రూ.10,500, సదాశివపేటకు చెందిన గోపాల్‌రెడ్డికి రూ.52 వేలు మంజూరయ్యాయి. ఎంపీ సూచనమేరకు టీపీసీసీ సభ్యుడు శ్రీనివాస్, జెడ్పీ ప్రణాళిక సంఘం మాజీ సభ్యుడు నగేష్ షెట్కార్ మంగళవారం చెక్కులు అందజేశారు. అలాగే కంగ్టి మండలం బోర్గికి చెందిన సజన్ లాల్‌కు రూ.42 వేలు, దర్గాతండాకు చెందిన ధరావత్ శాంకీకి రూ.15 వేల చెక్కులను ఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి అందజేశారు.

విధిగా నిబంధనలు పాటించాలి



సమావేశంలో పాల్గొన్న సిబ్బంది, పీఎస్‌లు

రాయికోడ్(అందోల్): జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా పనుల నిర్వహణలో సిబ్బంది విధిగా నిబంధనలు పాటించాలని అడిషనల్ పీడీ బాల్‌రాజ్, అసిస్టెంట్ విజిలెన్స్ ఆఫీసర్ నాగేశ్వర్‌రావు స్థానిక ఈజీఎస్ సిబ్బందిని ఆదేశించారు. ఏడాదిలో ఉపాధి హామీ పథకం నిధుల వినియోగంపై మంగళవారం రాయికోడ్‌లోని ఐకేపీ భవనంలో 15వ విడత సోషల్ ఆడిట్ నిర్వహించారు. 2024 ఏప్రిల్ 1నుంచి 2025 మార్చి 31న మధ్య చేసిన పనులపై ఆయా గ్రామాల్లో విచారణ చేపట్టారు. డీఆర్పీలు పనుల నిర్వహణ, నిధుల దుర్వినియోగంపై అధికారుల సమక్షంలో విచారణలో వెలుగుచూసిన అంశాలను వెల్లడించారు. నిరిత కాలంలో సుమారు రూ.11.75 కోట్ల నిధులను ఖర్చు చేశారు. అందులో రూ.6.79 కోట్ల నిధులను లేబర్ వర్కులకు ఖర్చు చేయగా రూ.4.96 కోట్ల నిధులను మెటల్ వర్కుల కోసం ఖర్చు చేశారని అధికారులు తెలిపారు. గ్రామాల వార్గీఆ డీఆర్పీల విచారణలో తేలిన అంశాలను విన్న అనంతరం రూ.92.429లను స్థానిక ఉపాధి హామీ సిబ్బంది నుంచి రికవరీ చేసేందుకు ఆదేశాలు జారీ చేసినట్లు అడిషనల్ పీడీ బాల్‌రాజ్ తెలిపారు. టీఏలు, ఎఫ్ఏలు, ఏపీఓ, పంచాయతీ కార్యదర్శులపై చర్యల కోసం ఒక్కో గ్రామానికి సంబంధించి కనీసం 5 షోకాజ్ నోటీసులు జారీ చేయనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో అంబుస్‌మెన్ రాంరెడ్డి, ఎంపీడీఓ ఎంఎం.షరీఫ్, ఏపీఓ రమేష్‌కుమార్, ఈసీ విష్ణు, ఎస్ఆర్పీ రాఘవులు, టీఏలు, ఎఫ్ఏలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎరువుల సరఫరా చేయాలని వినతి



అనుప్రియపటేల్‌ను కలిసిన పొన్నం ప్రభాకర్, సురేష్‌షెట్కార్

నారాయణఖేడ్: రోడ్డు రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ మంగళవారం ఢిల్లీలోని కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ మంత్రి అనుప్రియ పటేల్‌ను కలిశారు. తెలంగాణలో పండిస్తున్న పంటలకు ఎరువుల ఆవశ్యకతను ఆమెకు వివరించి ఎరువుల కొరత లేకుండా అవసరాలకు తగిన మేరకు సరఫరా చేయాలని కోరారు.

విద్యార్థులకు అవగాహన

సంగారెడ్డి టౌన్: విద్యార్థులకు చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై ఎమ్మెన్నార్ యూనివర్సిటీ సలహాదారుడు సత్యనారాయణ మంగళవారం అవగాహన కల్పించారు. అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నత చదువులు చదవాలన్నారు. కళాశాలలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరుగుతున్నప్పుడు వెంటనే మా దృష్టికి తీసుకురావాలన్నారు. రాగింగ్‌ను నివారించేందుకు వివిధ కమిటీల వివరాలను వెబ్‌సైట్‌లో ఉంచామన్నారు. కార్యక్రమంలో సంగారెడ్డి రూరల్ సీఐ క్రాంతి కుమార్, ఎస్సై రవీందర్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల ఆకస్మిక తనిఖీ

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండలంలోని ఆత్మకూర్ ప్రభుత్వ పాఠశాలను మంగళవారం ఎంఈఓ శంకర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. 10వ తరగతి విద్యార్థుల విద్యాబోధనను పరిశీలించి, ఇంటర్నల్ మార్కుల కోసం రాసిన రికార్డులను పరిశీలించారు. జరగబోయే పబ్లిక్ పరీక్షలను దృష్టిలో పెట్టుకొని ప్రతిరోజు ఉ. 4 గంటలకు నిద్ర మేల్కొని, సబ్జెక్టు వారీగా అన్ని విషయాలు చదివి, అర్థం కాని విషయాలను సబ్జెక్ట్ టీచర్స్‌కు తెలిపి నివృత్తి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం రామకోటయ్య, సీఆర్పీలు రాజేశ్వర్, మల్లేశం, ఉపాధ్యాయులు ఉన్నారు.

జన సురక్ష పథకంపై అవగాహన



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సుప్రభాత్

జిన్నారం (పటాన్‌చెరు): జన సురక్ష పథకంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జనరల్ మేనేజర్ ఎం.జి సుప్రభాత్ పేర్కొన్నారు. మంగళవారం గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని బొంతపల్లి, నల్లవల్లి గ్రామాల్లో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. జన సురక్ష పథకంతో పాటు పీఎం, ఎస్బీఐ పీఎం, జెజెసీవై ఇన్సూరెన్స్ సుకన్య సమృద్ధి యోజన, అటల్ పెన్షన్ యోజన పథకాలపై సమగ్రంగా అవగాహన కల్పించారు. ఎస్‌బీఐ ఇన్సూరెన్స్ స్కీంలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బ్యాంకు సంబంధిత వివరాలు ఇతరులకు పంపొద్దని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ జనరల్ మేనేజర్ వినోద్‌కస్తూరి, అసిస్టెంట్ జనరల్ మేనేజ్ ద్రోణకుమార్, రీజనల్ మేనేజర్ పవన్‌కుమార్‌రెడ్డి, మేనేజర్ రామచంద్రరావు, అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ నరేందర్, బ్రాంచ్ మేనేజర్ శ్రీదేవి, ఎంపీడీఓ ఉమాదేవి ప్రజలు పాల్గొన్నారు.

ఎత్తిపోతలకు కొత్తనీరు



జాడిమల్కాపూర్ ఎత్తిపోతల వద్ద జలకళ

జహీరాబాద్ టౌన్: గత రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ వర్షాలకు మొగుడంపల్లి మండలంలోని సజ్జరావుపేట తండా పరిధిలో ఉన్న జాడిమల్కాపూర్ ఎత్తిపోతలకు జలకళ సంతరించుకుంది. ఈ వాటర్ ఫాల్ తెలంగాణ-కర్ణాటక రాష్ట్రాల సరిహద్దులో ఉండడంతో పర్యాటకులు చూసేందుకు తరలివస్తున్నారు. మరోవైపు ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు పడడంతో ఎత్తిపోతలకు భారీగా వరద వస్తుంది. కొండల మధ్య నుంచి పెద్ద లోయలోకి పడుతున్న జలపాతం అందాలను చూసేందుకు జహీరాబాద్ పరిసర ప్రాంతాలతో పాటు సమీప గ్రామాలు, గిరిజన తండాల ప్రజలు చూసేందుకు వస్తున్నారు.

అక్రమ వెంచర్లు.. నాలాల మూసివేత

రోడ్లపై ప్రవహించిన వరద నీరు



వరదనీటిలో ప్రయాణిస్తున్న వాహనదారులు

జహీరాబాద్: పట్టణంలోని రియల్ ఎస్టేట్ వ్యాపారులు నాలాలను మూసేస్తూ అక్రమ వెంచర్లు ఏర్పాటు చేశారు. దీంతో అల్లోల్, భరత్‌నగర్ వెళ్లే రహదారిపై వరదనీరు చేరి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తాయి. ఈ విషయమై అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వై.నరోత్తం ఆరోపించారు. మంగళవారం వరద ముంచెత్తిన ప్రాంతాలను పరిశీలించారు. రహదారిపై ఉన్న వరద కాలువకు అడ్డంగా గోడ కట్టడం వల్లే వరదనీరు దారిమళ్లి రహదారిపైకి వచ్చి చేరుతోందన్నారు. వర్షం నీరు అల్గోల్ రహదారిపై పారడంతో చెరువును తలపిస్తోంది.

కిటకిటలాడిన సిద్ధివినాయక ఆలయం

- అంగార చతుర్థిని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు
- వేలాదిగా తరలివచ్చిన భక్తులు



భక్తులతో కిటకిటలాడుతున్న ఆలయ ప్రాంగణం

న్యాల్‌కల్(జహీరాబాద్): మండలంలోని రేజింతల్ గ్రామ శివారులో స్వయంభూగా వెలసిన సిద్ధివినాయక ఆలయం భక్తులతో కిటకిటలాడింది. అంగార చతుర్థిని పురస్కరించుకొని భక్తులు భారీ సంఖ్యలో ఆలయానికి తరలి రావడంతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. ఏడాదిలో ఒకటి రెండు సార్లు మంగళవారం వచ్చే అంగారక చతుర్థినాడు స్వామివారిని దర్శించుకుంటే కోరిన కోర్కెలు నెరవేరుతాయని భక్తుల నమ్మకం. అందులో భాగంగా అధిక శాతం భక్తులు కాలినడకన వచ్చి దైవదర్శనం చేసుకున్నారు. జిల్లాలోని నలుమూలల నుంచే కాకుండా సమీప కర్ణాటక, మహారాష్ట్రాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. కాలినడక ఆలయానికి వస్తున్న భక్తులకు అన్నదానం నిర్వహించారు. భక్తుల సౌకర్యార్థం బీదర్ ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు నడపా రు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జహీరాబాద్ డీఎస్పీ సైదానాయక్ ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

స్వామివారిని దర్శించుకున్న న్యాయమూర్తులు

జిల్లా న్యాయమూర్తి భవానీచంద్ర, జహీరాబాద్ మున్సిఫ్ కోర్టు సివిల్ జడ్జి కవితారెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చిన వారికి ఆలయ కమిటీ సభ్యులు స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి దైవదర్శనం చేసుకున్నారు.

కొనసాగుతున్న అక్రమ నిర్మాణాల తొలగింపు

కంది(సంగారెడ్డి): కంది మండలంలో అక్రమ కట్టడాలపై రెవెన్యూ అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. ప్రభుత్వ భూముల్లో అక్రమంగా వెలిసిన కట్టడాలను తొలగిస్తున్నారు. ఈనెల 5న మండలంలోని వడ్డెనుగూడా తండా శివారులో కబ్జాకు గురైన లక్షబాటను తిరిగి ఏర్పాటు చేయించారు. అలాగే, చేర్యాల్ శివారులో అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన హోటల్‌ను తొలగించారు. మంగళవారం కాశీపూర్‌లోని 108 సర్వే నంబర్‌లో నిర్మించిన కట్టడాలను జేసీబీతో కూల్చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రవికుమార్ మాట్లాడుతూ.. ఎవరైనా ప్రభుత్వ స్థలాలను కబ్జా చేస్తే ఉపేక్షించబోమని వెల్లడించారు. కార్యక్రమంలో ఆర్ఐ రంగయ్య, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ నేడు విద్యుత్ అంతరాయం

పటాన్‌చెరు టౌన్: చెట్ల కొమ్మలు తొలగింపు నేపథ్యంలో నేడు విద్యుత్ సరఫరా అంతరాయం ఉంటుందని పటాన్‌చెరు ఏఈ జగదీశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డివిజన్ పరిధిలోని జె.పి కాలనీ, నాగులమ్మ గడ్డ, ఎం.జీ రోడ్డు, ముదిరాజ్ బస్తీ, చైతన్య నగర్ కాలనీ, భగత్‌గల్లి, రామ్ మందిర్ రోడ్డు, అంబేద్కర్‌కాలనీ, వెంకటేశ్వర థియేటర్ పారిశ్రామిక వాడలో బుధవారం ఉ. 10 గంటల నుంచి మ.12 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. అలాగే, మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పటాన్‌చెరు పారిశ్రామికవాడ, ఆర్టీసీ బస్టాండ్, మీరాజ్ హోటల్, శాంతినగర్ కాలనీలో విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు.

◆ పోషకాహారంతో క్షయవ్యాధి దూరం

నారాయణఖేడ్: క్షయవ్యాధి రోగులు భయపడవద్దని మందులు, పోషకాహారంతో తగ్గిపోతుందని ఖేడ్ డిప్యూటీ డీఎం అండ్‌హెచ్ఓ డా. సంధ్యారాణి, జిల్లా క్షయ నియంత్రణ విభాగం సమన్వయకర్త అరుణ తెలిపారు. ప్రధానమంత్రి టీబీ ముక్త్‌లో భాగంగా గ్లోబల్ గ్రీన్ సంస్థ క్షయ వ్యాధిగ్రస్తులను దత్తత తీసుకుని ఆరునెలలు పోషకాహారం అందజేయడానికి నిర్ణయించింది. ఈ మేరకు మంగళవారం ఖేడ్ ప్రాంతీయ ఆస్పత్రిలో బాధితులకు పోషకాహార కిట్లను అందజేశారు. వారు మాట్లాడుతూ.. రెండు వారాల పాటు దగ్గుతో బాధపడుతున్న వారు నిర్లక్ష్యం చేయకుండా సమీప పీహెచ్‌సీల్లో తెమడ పరీక్ష చేయించుకోవాలని సూచించారు.

◆ ఎక్కువ మండపాలకు అనుమతి ఇవ్వొద్దు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని పాటి గ్రామానికి చెందిన మాజీ ప్రజాప్రతినిధులు గ్రామంలో ఎక్కువ వినాయక మండపాలకు అనుమతులు ఇవ్వొద్దని మంగళవారం మేనేజర్ అఖిల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ నాయకులు మాట్లాడుతూ.. కొన్ని ఏళ్లుగా గ్రామంలో మూడు వినాయక మండపాలను మాత్రమే ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ విషయంలో గతంలో గ్రామస్తులం అందరం కలసి తీర్మానం చేసుకున్నామని చెప్పారు. ఈ ఏడాది ఇతర వినాయక మండపాలకు అనుమతులు ఇవ్వకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

◆ ఇందిరమ్మ ఇళ్ల పనుల పరిశీలన

మునిపల్లి(అందోల్): ఇందిరమ్మ ఇళ్లకు నిర్మాణం ప్రకారం బిల్లులు మంజూరవుతాయని ఎంపీడీఓ హరినందన్‌రావు తెలిపారు. మంగళవారం మండలంలోని అల్లాపూర్‌లో ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. లబ్ధిదారుల బ్యాంక్ అకౌంట్‌లో డబ్బులు జమ చేసినట్లు చెప్పారు. అల్లాపూర్‌లో 10 మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరవ్వగా.. 8 మంది లబ్ధిదారులు బిస్మెంట్ లెవల్‌కు నిర్మాణం చేసిన వారికి బ్యాంక్ అకౌంట్‌లో డబ్బులు పడినట్లు ఎంపీడీఓ బ్యాంక్ పాస్ బుక్ జిరాక్స్ కాపీలను లబ్ధిదారులకు అందజేశారు.

◆ ముంచెత్తిన వరద



జహీరాబాద్: పట్టణంలోని వసంత్‌విహార్ కాలనీని వరద ముంచెత్తింది. రెండు రోజుల పాటు కురిసిన వర్షాలకు రోడ్లన్నీ వరదనీటితో స్తంభించి రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కాలనీని లోతట్టు ప్రాంతంలో ఏర్పాటు చేయడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు.

◆ మొక్కల పంపిణీ

జిన్నారం (పటాన్‌చెరు): గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని మాదారం గ్రామంలో కమిషనర్ వెంకటరామయ్య ఆధ్వర్యంలో స్థానికులకు మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న వన మహోత్సవంలో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని సూచించారు. ఈ సందర్భంగా బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని కాలనీల్లోని ఖాళీ ప్రదేశాల్లో కమిషనర్ కిషన్ ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది మొక్కలు నాటారు.

◆ హరీశ్‌రావును కలసిన కార్పొరేటర్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): మాజీమంత్రి హరీశ్ రావును ఆయన నివాసంలో మంగళవారం భారతినగర్ డివిజన్ కార్పొరేటర్ సింధు రెడ్డి మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. విలేకరులతో ఆమె మాట్లాడుతూ మాజీమంత్రి హరీశ్‌రావుకు రాఖీ కట్టానని తెలిపారు.

◆ సీతారాం ఏచూరికి నివాళి

జహీరాబాద్ టౌన్: సీపీఎం జాతీయ నాయకుడు కామ్రేడ్ దివంగత సీతారాం ఏచూరి జయంతిని సీపీఎం నాయకులు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని శ్రామిక్ భవనంలో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నాయకులు బి,రాంచందర్ మాట్లాడుతూ..భారత రాజకీయాల్లో ఏచూరి గొప్ప పాత్రపోషించారన్నారు. పార్లమెంట్‌లో ప్రజాసమస్యల పరిష్కారం కోసం పోరాటం చేశారన్నారు.

◆ ముగిసిన సప్తహ భజన

రాయికోడ్(అందోల్): మండలంలోని విఠలేశ్వరుని ఆలయంలో వారం రోజులుగా కొనసాగుతున్న సప్తహభజన కార్యక్రమం మంగళవారం ముగిసింది. గ్రామంలో భజన చేస్తూ శోభాయాత్ర నిర్వహించారు. భక్తులు పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ముగింపు వేడుకలకు విచ్చేసిన జిల్లా గ్రంథాలయాల సంస్థల చైర్మన్‌కు ఆలయ నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు చేశారు.

◆ ప్రకృతి వనంలో దొంగల బీభత్సం

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని అన్నారం సమీపంలోని ప్రకృతివనం కాలనీలో దొంగలు బీభత్సం సృష్టించారు. కొన్ని రోజులుగా కాలనీలో జరుగుతున్న వరుస దొంగతనాలతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. సోమవారం అర్ధరాత్రి నాలుగు ఇళ్లలో దొంగలు చోరీ చేశారు. రెండు రోజుల క్రితం ఓ ఇంట్లోకి చొరబడి బీరువా, కబోర్డులను ధ్వంసం చేసి వస్తువులు డబ్బులు ఎత్తుకెళ్లారని వాపోతున్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

◆ పుస్తకాల ప్రాముఖ్యత తెలుసుకోవాలి

జోగిపేట(అందోల్): గ్రంథాలయం, పుస్తకాల యొక్క ప్రాముఖ్యతను విద్యార్థులు తెలుసుకోవాలని జోగిపేట కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి పండరి అన్నారు. ప్రభుత్వ నెహ్రూ మెమోరియల్ డిగ్రీ కళాశాలలో గ్రంథాలయ విభాగం ఆధ్వర్యంలో జాతీయ గ్రంథపాలకుల దినోత్సవం నిర్వహించారు.

◆ సీఎంకు కృతజ్ఞతలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్‌లో అమరుల స్మృతివనం ఏర్పాటుకు సీఎం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం ఆనందంగా ఉందని మాజీ కౌన్సిలర్ భరత్ అన్నారు. గద్దర్ విగ్రహం వద్ద స్మృతివనం ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రిను కోరామన్నారు. స్పందించి ఆయన ప్రత్యేక నిధులను కేటాయించినట్లు చెప్పారు.